క్లుప్తంగా

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి



గుమ్మళ్లదొడ్డిలోని వేంకటేశ్వరస్వామి

గోకవరం: తంటికొండ గ్రామంలో గుమ్మళ్లదొడ్డిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వెంకటగిరి కొండపై వెలసిన స్వామివారిని తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డి గ్రామ శివారున పుట్టలో వెలసిన వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి వేలాదిగా భక్తులకు తరలివచ్చారు. మండలం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు కాలినడకన ఆలయానికి వచ్చి ప్రదిక్షణలు చేసి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

దుస్తులు, స్వీట్ల పంపిణీ



మహిళలకు దుస్తులు, స్వీట్లు అందజేస్తున్న నవీన్

గండేపల్లి: మురారిలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ చేతుల మీదుగా మహిళలు, వృద్ధులకు దుస్తులు, స్వీట్ల పంపిణీ చేశారు. రాష్ట్ర హౌసింగ్ బోర్డ్, సివిల్ సప్లై మాజీ డైరెక్టర్, ఉమ్మడి జిల్లా తెలుగు రైతు మాజీ అధ్యక్షుడు కందుల కొండయ్యదొర వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వారాహీదేవిగా దేవీచౌక్ కనకదుర్గమ్మ



వారాహీదేవిగా పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక ప్రసిద్ధి చెందిన దేవీచౌక్ ఆలయంలో ఉన్న కనకదుర్గమ్మ శనివారం వారాహీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం ప్రారంభం వారాహీ నవరాత్రులను పురస్కరించుకుని ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మలు అమ్మవారిని వారాహీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ వారాహీ నవరాత్రులు నిర్వహిస్తున్నట్టు అర్చకులు తెలిపారు

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఉపాధ్యాయుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎంఈఓ రాజబాబు

ప్రత్తిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడి కుటుంబానికి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కుటుంబ సంక్షేమ నిధి నుంచి రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బిరుద సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఆయన యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ సంఘం సభ్యుడు కావడంతో ఆయన కుటుంబ సభ్యులకు శనివారం సాయంత్రం మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు చేతుల మీదుగా చెక్కును అందజేశారు. మండల శాఖ అధ్యక్షుడు కోడి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు జి.ప్రభాకర వర్మ, జిల్లా సంఘ నాయకులు వీవీ రమణ, రాపర్తి రామలింగేశ్వరరావు, వి.రవితేజా, జీఎస్ ప్రసాదబాబు, సూర్యావతి, రాజబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ

పిఠాపురం: గ్రామం నుంచి చిత్రాడ వెళ్లే దారిలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో గుర్తు తెలియని దుండగులు శనివారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. పిఠాపురం పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. చిత్రాడ వెళ్లే దారిలో ఉన్న మద్యం దుకాణంలో గుర్తు తెలియని దుండగులు దుకాణం పైకప్పు తొలగించి 42 ఫుల్ బాటిళ్లు, 10 బీరు బాటిళ్సు చోరీ చేశారు. దుకాణ సిబ్బంది శనివారం ఉదయం వచ్చి చూడగా చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిఠాపురం పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్లాస్టిక్ నిషేధంలో నిర్లక్ష్యం

- యథేచ్ఛగా వ్యాపారస్తుల వినియోగం
- బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



తాండవ నదిలో భారీగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

కోటనందూరు: మానవ మనుగడకే పెను సవాలుగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు నడుం బిగించాయి. వంద మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న (సింగిల్ యూజ్) ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సమాజంలో ప్రతి పౌరుడు ప్లాస్టిక్ నిషేధాన్ని బాధ్యతగా తీసుకొని అమలు చేయాలని సూచించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నిబంధనలు పాటించాలని సూచించింది. అయితే పల్లెల్లో ప్రజలు ప్లాస్టిక్ నిషేధాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బహిరంగంగానే ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తూ పర్యావరణానికి, ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలును ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ వినియోగం యధేచ్ఛగా కొనసాగుతోంది. దీనిపై సంబంధిత అధికారులు కొరడా ఝుళిపించి ప్లాస్టిక్ నిషేధం పగడ్బందీగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రియులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాలో 183 పంచాయతీలున్నాయి. పట్టణాల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని కొంతమేర పాటిస్తున్నా.. పల్లెల్లో మాత్రం పట్టించుకోవడం లేదు. కిరాణా, కూరగాయలు, మాంసం, ఫ్యాన్సీ దుకాణాలు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, హోటళ్లలో యధేచ్ఛగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను సరఫరా చేస్తున్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లలను యథావిధిగా వినియోగిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులతో పాటు వినియోగదారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పంచాయతీల పరంగా గ్రీన్‌అంబాసిడార్లు సేకరించే చెత్తలో అధిక శాతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉండడం గమనార్హం. గ్రామాల శివార్లలో సైతం గుట్టలుగా పేరుకుపోయిన ప్లాస్టిక్ దర్శనమిస్తోంది. నదులు, చెరువులు, కాలువల్లో సైతం భారీగా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ పేరుకుపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్లాస్టిక్ వినియోగంతో ప్రాణాంతక వ్యాధులు

ప్లాస్టిక్ వినియోగం ద్వారా ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ప్లాస్టిక్ ఏదొక రూపంలో మనిషి శరీరంలోకి ప్రవేశించి క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు మనిషి జీవితాన్ని అతలాకుతలం చేస్తుందని వైద్యాధికారులు చెబుతున్నారు. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణాన్ని దెబ్బతీసి ఆ ప్రభావం మనిషి జీవితంపై పడేలా చేస్తుందని వివరించారు. వాతావరణంలో అసమానతలకు తక్కువ పరిమాణం కలిగిన ప్లాస్టిక్ వినియోగమేనని హెచ్చరిస్తున్నారు.

అవగాహనతోనే అదుపు సాధ్యం

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి, మానవ జీవితానికి వాటిల్లే అనర్థాలపై అధికారులు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ నిషేధంలో విద్యార్థులు, యువత, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, డ్వాక్రా సంఘాలు, విద్యావంతులను భాగస్వాములు చేసి ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు తీసుకోవాలి. పల్లెల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించడం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టే అవకాశం ఉంటుందని పర్యావరణ ప్రియులు అభిప్రాయపడుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలి. కాలచక్రంలో అసమానతలను తొలగించాలంటే ప్రజలంతా ఇంటా, బయటా చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలి. మానవ మనుగడకు పెను సవాలుగా మారుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి. చెట్ల నరికివేతను, ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా మానుకోవాలి.

– లెక్కల స్వామినాయుడు, రిటైర్డ్ ఎంఈఓ, జగన్నాథపురం

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాయి. ప్రజలంతా బాధ్యతగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలి. ప్లాస్టిక్ వినియోగించిన వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం. దుకాణాలలో ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు సరఫరా చేస్తే చర్యలు తప్పవు. ప్లాస్టిక్ వినియోగంపై మెరుపుదాడులు నిర్వహిస్తాం.

– అరుణ్‌కుమార్, ఈఓపీఆర్డీ, కోటనందూరు

ఘనంగా తోట నరసింహం పుట్టిన రోజు వేడుక



తోటకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

కిర్లంపూడి: మాజీ మంత్రి తోట నరసింహం పుట్టిన రోజు వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. నియోజకవర్గం నలుమూలల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు వీరవరంలోని ఆయన స్వగృహానికి భారీగా తరలివచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌ను కట్ చేసి స్వీట్స్‌ను పంచారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

తుని: రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.బాలకోటేశ్వరరావు సూచించారు. స్థానిక వివేక్ జూనియర్ కళాశాలలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. 18 సంవత్సరాలు కంటె తక్కువ వయస్సు కలిగిన యువకులు మోటారు వాహనాలు నడపకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారన్నారు. తుని పరిసర ప్రాంతంలో భారీగా ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు నిబంధనలు కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి



ఏలేశ్వరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కిర్లంపూడిలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న యూత్ సభ్యులు

ఏలేశ్వరం: దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని శనివారం పట్టణంలో నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక పెద్దవీధి ఎస్సీపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జిల్లా కార్యవర్గసభ్యుడు గట్టెం వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ చిన్నతనం నుంచి కులవివక్షపై పోరాటం చేశారన్నారు. దళితుల్లో మొదటిసారిగా ఉప ప్రధాని చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీమోర్చా అధ్యక్షుడు విజయ బాబు, పార్టీనాయకులు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో..

కిర్లంపూడి: మండలంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. కిర్లంపూడిలోని ప్రియదర్శిని యూత్, బాబూజగ్జీవన్ రామ్ యూత్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అన్నవరం, జగ్గంపేట గ్రామాల్లోని అనాధ ఆశ్రమాల్లో భోజన ఏర్పాట్లు చేశారు. అందజేశారు.



జగ్గంపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పించిన నేతలు

జగ్గంపేటలో..

జగ్గంపేట: భారతదేశ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి జగ్గంపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్సీకాలనీలో ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నేతలు, కాలనీ పెద్దలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు కొత్తపల్లి సంజీవరావు,పల్లపాటి నాగేశ్వరరావు,వేమగిరి బుజ్జి, కొత్తపల్లి వివేక్,చిట్టిబాబు, గంపల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాండవలో 361 అడుగుల నీటి నిల్వలు



తాండవ జలాశయం

కోటనందూరు: తాండవ జలాశయంలో ప్రస్తుతం 361 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. జలాశయ గరిష్ట నీటిమట్టం 380 అడుగులు కాగా కనిష్ట నీటి మట్టం 340 అడుగులు. 370 అడుగుల నీటి నిల్వలు ఉంటే నీటి విడుదలకు అనుకూలం. తాండవ ప్రాజెక్టు నుంచి కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో సుమారుగా 60 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాల్సి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఖరీఫ్ రైతులు నారుమళ్లను తయారు చేశారు. అయితే గత నాలుగు రోజులుగా వర్షాలు ముఖం చాటేయడం, ఇదే పరిస్థితి కొనసాగితే నారు మళ్లకు సాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపధ్యంలో నీటి విడుదలపై ఆయకట్టు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండకపోతే ఈ ఏడాది ఖరీఫ్ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

ఎన్‌డీఏ పాలనలో ప్రతిపక్షాలపై దాడులు

- సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత



సమావేశంలో మాట్లాడుతున్న బుగత బంగార్రాజు

ప్రత్తిపాడు: కేంద్ర–రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వ పాలనలో ప్రతిపక్ష పార్టీపై దాడులు కొనసాగుతున్నాయని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్రకమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు ఆరోపించారు. స్థానిక లిబరేషన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (ఆయర్లా) మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బుగత ప్రసంగిస్తూ కేంద్ర, రాష్ట్రాలలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి అహంకారపూరితమైన విధానాలతో ప్రయాణం చేస్తున్నాయన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలలో ప్రధాని మోదీ ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో ప్రతిపక్ష పార్టీపై దాడులు జరపుతున్నారంటే ఒక ఫ్యాక్షన్ పాలన నుంచి నియంత పాలనకు వచ్చామని అన్నారు. గ్రామాల్లో ప్రస్తుత ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్ సీపీపై దాడులు పెంచేశారని, ఇటువంటి విధానాల వల్ల ప్రభుత్వం ఎంతో కాలం మనుగడ సాగించలేదని అన్నారు. ప్రస్తుతం ప్రజల సమస్యలపై మాట్లాడే పార్టీలే లేకుండా పోయాయన్నారు. ప్రజా ఉద్యమాలు నడిపించడం సీపీఐ (ఎంఎల్)దే బాధ్యతని, దానికోసం పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని లిబరేషన్ కేంద్ర కమిటి సభ్యుడు బుగత బంగార్రాజు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అయర్లా రాష్ట్ర కమిటీ నాయకులు కె.జనార్దన్, మానుకొండ లచ్చబాబు, అఖిల భారత ప్రగతి శీలా మహిళా సంఘ నాయకురాళ్ళు పేరూరి లక్ష్మి, వల్ల లక్ష్మి, విప్లవ యువజన సంఘ నాయకుడు చిన్నం నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో అంతర సాగు లాభదాయకం



హంసవరంలో పత్తిపైరులో అంతర పంట సాగును పరిశీలిస్తున్న ఏడీఏ భ్రమరాంబ

తుని రూరల్: పత్తిపంటలో అంతర పంటల సాగు లాభదాయకంగా ఉంటుందని జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) వ్యవసాయ సహాయ సంచాలకులు భ్రమరాంబ అన్నారు. శనివారం హంసవరం గ్రామంలో పత్తిపైర్లను ఏఓ బి.అశోక్ కుమార్‌తో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పత్తిలో అంతర పంటలు సాగు చేయడం వల్ల తెగుళ్ల, పురుగులను నివారించుకోవచ్చన్నారు. అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం రైతులు పొందవచ్చన్నారు. రాగి పైర్లను ఆరుతడిగా సాగు చేసుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో అధికాదాయం లభిస్తుందన్నారు. రాగి పైర్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్టు ఆమె తెలిపారు. రాగి పైరు సాగు చేస్తున్న రైతులను గుర్తింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. రైతులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి



ప్రత్తిపాడులో జూనోసిస్ దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ



కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి వీర్రాఘవరావు

ప్రత్తిపాడు: రోగాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. ప్రత్తిపాడులో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. పశువుల పెంపకందారులు, రైతులు, ప్రజలు జూనోటిక్ వ్యాధులపై అవగాహన పెంచుకుని, పశువైద్యుల సూచనల మేరకు తక్షణ నివారణా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన మందులను పశుసంవర్ధకశాఖ ఏడీ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్‌కు అందజేశారు. ధర్మవరం ప్రభుత్వ పశువైద్యశాల వైద్యాధికారి సుంకర వరలక్ష్మి, మాజీ మండల ఉపాధ్యక్షుడు బొల్లు కొండబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

రౌతులపూడి: మండల పశువైద్యాధికారి ముద్రగడ వీర్రాఘవరావు ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు శనివారం యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 70 కుక్కలకు టీకాలు వేశామన్నారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే ర్యాబిస్, ఆంత్రాక్స్, స్వైన్‌ఫ్లూ, బర్డ్‌ఫ్లూ, బ్రిసిల్లా వ్యాధులను జ్యూనోటిక్ వ్యాధులంటారని వివరించారు. వీటిని అరికట్టడమే లక్ష్యంగా యాంటీ ర్యాబిస్ టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ వరహాలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది అపర్ణ, చిట్టిపాప తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి శ్యాంప్రసాద్ ముఖర్జీ



ఏలేశ్వరంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలేశ్వరం: బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యాంప్రసాద్‌ముఖర్జీ చేసిన సేవలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మహోన్నత వ్యక్తి శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ నాయకుడు ఊటా వీరబాబు అన్నారు. ధర్మవరంలో జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 123వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్ఎస్ నారాయణ, ఎస్, నాని, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీల చోరీ

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ కాంప్లెక్‌లోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో హుండీలు చోరీకి గురయ్యాయి. శనివారం తెల్లవారుజామున ఆలయంలో దొంగలు చోరబడి తలుపులను బద్దలగొట్టి స్వామి వారి హుండీలలో సుమారు యాభైవేల రూపాయల నగదును దోపిడీ చేశారు. ఉదయం ఆలయం తెరచి చూసేసరికి హుండీలు పగులగొట్టి ఉండడంతో ఆలయ కమిటీ సభ్యులు సిద్ధ వీరబాబు, ముమ్మిడి ఈశ్వరరావు, మాదేపల్లి నాగేశ్వరరావు తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొల్లప్రోలు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీం అధికారులు హుండీలు ఆలయ పరిసరాల్లో వేలిముద్రలు సేకరించారు.

విత్తన, ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో శనివారం విత్తన, ఎరువులు షాపులపై వ్యవసాయ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రాష్ట్ర తనిఖీ బృందం విజిలెన్స్, వ్యవసాయ అధికారుల కలసి గొల్లప్రోలు మండలం గొల్లప్రోలులో శ్రీ కృష్ణ ఏజెన్సీస్ ప్రవంతి ఆగ్రో ఏజెన్సీస్‌లో తనిఖీ చేసి ఎటువంటి అభ్యంతరాలు లేవని నిర్ధారించారు. స్టాక్ రిజిస్టర్లు బిల్ బుక్స్ తనిఖీ చేసిన అధికారులు ఎటువంటి తేడాలు లేవని తెలిపారు.

దివ్యాంగ చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



ఏలేశ్వరంలో దివ్యాంగ పిల్లలను పరిశీలిస్తున్న ఏఎంఓ నాగేశ్వరరావు

ఏలేశ్వరం: దివ్యాంగ చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా అకడమిక్ మోనెటరింగ్ అధికారి చామంతి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలో శనివారం ఆయన గృహ ఆధారిత విద్యను సందర్శించారు. ఇళ్ల వద్ద దివ్యాంగ పిల్లలను పరిశీలించి, తల్లిదండ్రులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల కోసం భవిత కేంద్రంలో శిక్షణ ఇస్తోందన్నారు. వీరిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ అబ్బాయి, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అల్పపీడనం ప్రభావంతో వర్షాలు



ఏలేశ్వరంలో కురుస్తున్న వర్షం



ప్రత్తిపాడు అల్లూరి జంక్షన్‌లో నిలిచిన వర్షపు నీరు

ఏలేశ్వరం: అల్పపీడన ప్రభావంతో నియోజవర్గ వ్యాప్తంగా భారీగా వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి వర్షం పడి మధ్యాహ్నం ఎండ కాసింది. వర్షానికి రహదారులు, పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని పలుప్రాంతాల్లో రహదారులపై వర్షం నిల్వ ఉండిపోయింది. స్థానిక లింగవరంకాలనీ, చైతన్యనగర్ కాలనీ, తదితర కాలనీల్లోని రహదారులు బురదమయంగా మారాయి. ఈ వర్షాలు ఖరీఫ్‌కు అనుకూలంగా ఉంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు అంటురోగాలు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుండపోత వర్షం

ప్రత్తిపాడు: మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. వర్షానికి పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. దీనివల్ల వాహన దారులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. వాన రాకడ కోసం ఎదురు చూస్తున్న రైతాంగానికి కాస్త ఊరట లభించింది. నేలకు తడి అందిందన్న ఆనందం రైతుకు కలిగింది.